పంచాయతీ ఆదాయ వనరులు పెంచాలి

ప్రత్యేకాధికారి డాక్టర్ పీవీ రమేష్‌కుమార్

మోపిదేవి: పంచాయతీలకు ఆదాయ వనరుగా ఉన్న సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని గ్రామదర్శిని ప్రత్యేకాధికారి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ పీవీ రమేష్‌కుమార్ అన్నారు. నాగాయితిప్ప, పెదప్రోలు గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. నాగాయితిప్ప సచివాలయంలో రమేష్ కుమార్, పెదప్రోలు సచివాలయ పరిధిలో ఆనందరావు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లను పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు బాగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధానంగా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. జగనన్న కాలనీలో మెరకపనుల వల్ల నిర్మాణాలు ఆలస్యం అవుతున్నట్లు గమనించామని ఈ సమస్యలు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామని వివరించారు. పెదప్రోలు జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులపై ఆనందరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు, పాలిమెట్ల ఏసుబాబు, ఎంపీడీఓ పార్వతి, గ్రామ కార్యదర్శులు త్రిపురసుందరి, పేర్ని మాధవేంద్రరావు, వీఆర్వోలు మత్తి గోపాలకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉన్నతాధికారుల పర్యటన

పెడన: మండలంలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. అచ్చయ్యవారిపాలెంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, చేవేంద్రలో చీఫ్ ప్లానింగ్ అధికారి వై. శ్రీలత, కాకర్లమూడిలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ డి. శ్రీనివాసరావు, మడక గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి ఎస్‌వీ నాగేశ్వర నాయక్ పర్యటించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, తాగునీటి సరఫరా, గ్రామ సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం తదితర వాటిని సందర్శించి వాటి పనితీరు, ఆయా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరిశీలించి నివేదికలు తయారు చేసుకున్నారు. జగనన్న గోరుముద్ద, రాగిజావ తదితర వాటిని అందిస్తున్నది లేనిది పరిశీలించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కృత్తివెన్ను: గ్రామాలలో క్షేత్ర స్థాయి పర్యటన ద్వారా సమస్యలను గుర్తించి వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు ప్రభుత్వానికి నివేదించడం ద్వారా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ టి. ప్రసాదరావు అన్నారు. కొమాళ్లపూడి పంచాయతీలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీలు, పాఠశాలలు, రక్షిత మంచినీటి చెరువులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సమస్యలను నమోదు చేసుకుని నివేదికలను తయారు చేశారు. కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్ పాల్గొని తాగునీరు, అంతర్గత రహదారుల అవసరాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి, సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు పి. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీపురంలో జరిగిన గ్రామదర్శినిలో డీఎల్పీఓ ఐ. జ్యోతిర్మయి పాల్గొన్నారు.



మడక గ్రామంలోని పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ నాగేశ్వర నాయక్



కొమాళ్లపూడిలో సమస్యలు నమోదు చేసుకుంటున్న గ్రామదర్శిని అధికారి. చిత్రంలో ఎంపీపీ గరుడప్రసాద్

కోడూరు, విశ్వనాథపల్లి గ్రామాల్లో..

కోడూరు: కోడూరు, విశ్వనాథపల్లి పంచాయతీల పరిధిలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. కోడూరు పంచాయతీలో గన్నవరం వ్యవసాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సునీల్, విశ్వనాథపల్లి పంచాయతీలో జిల్లా భూగర్భ జలాల అధికారి డి.విజయ వర్ధన్‌రావు పర్యటించారు. ఆయా పంచాయతీల్లోని జెడ్పీ, ఎంపీయూపీ, ఎంపీపీ పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థుల హాజరుశాతంపై ఆరా తీసి, బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కోడూరు బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించి, అక్కడ వసతులపై ఆరా తీశారు. వార్డెన్‌తో పాటు సిబ్బంది విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉంటూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓ పాండురంగారావు, ఎంఈఓ టీవీఎం రామదాసు, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బంటుమిల్లి:** చోరంపూడి గ్రామాన్ని బందరు ఆర్‌డీఓ కిషోర్, ములపర్రులో డీఆర్‌డీఏ పీడీ టీఏస్‌ఆర్ ప్రసాద్, నాగేశ్వరరావుపేట పంచాయతీలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వి. రవికుమార్ శుక్రవారం పర్యటించారు. స్థానిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రక్షిత మంచినీటి పథకాలు, సచివాలయాలను సందర్శించి రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలను పరిశీలించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అంచనాలు సిద్ధం చేసి ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు వారు హామీ ఇచ్చారు. ఎంపీడీఓ స్వర్ణభారతి, తాహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, ఏపీఎం డి. శ్రీను, వైస్ ఎంపిపి ఓ. చిన్నారి బాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● **మోదుమూడి(అవనిగడ్డ):** మండల పరిధిలోని మోదుమూడిలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యూరు సబ్ డివిజినల్ పంచాయతీ అధికారి ఏవీఎస్ నాంచారయ్య గ్రామంలో పర్యటించారు. ఎంపీయూపీ స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈఓ రమాకుమారి, వీఆర్వో ఎస్. నారాయణరావు, సచివాలయ కార్యదర్శి ఆది అశోక్, సచివాల ఉద్యోగులు పాల్గొన్నారు.

● **ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం పలు శాఖల అధికారులు గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. దాలిపర్రులో కృష్ణా జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ, ఘంటసాలపాలెంలో కృష్ణా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం. సునీత, శ్రీకాకుళంలో మొవ్వ ఏడీఏ ఎస్. శ్యామల పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, జగనన్న కాలనీలను సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు శాంతకుమారి, రజని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుద్రవరంలో జేసీ పర్యటన

కోనేరుసెంటర్: బందరు మండలం రుద్రవరం గ్రామంలో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామదర్శిని కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని హైస్కూల్‌ను సందర్శించిన ఆమె విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యా బోధన, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామస్తులకు వైద్యపరమైన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలవడాన్ని దగ్గరుండి పరిశీలించారు. చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రత్యేకాధికారి, డీఎస్‌ఓ వి. పార్వతి, ఎంఈఓ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఆర్‌ఐ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరం పాఠశాలలో విద్యార్థినితో చదివిస్తున్న జేసీ అపరాజిత సింగ్

క్షయ నిర్మూలనకు ప్రతిజ్ఞ



కోడూరు: ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిట్టల్లంక ఆరోగ్య కేంద్రం వద్ద క్షయ వ్యాధి నిర్మూలనపై గ్రామస్తులతో వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. టీబీ వ్యాధి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తోందని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. అనంతరం వ్యాధి లక్షణాలను వివరించారు. ఏఎన్‌ఎం సౌజన్య, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

చల్లపల్లి: ప్రపంచ టీబీ వ్యాధి నియంత్రణ దినోత్సవాన్ని స్థానిక కస్తూరిబా మెమోరియల్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించారు. ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదేవి, చల్లపల్లి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు కోడిగుడ్లు, పోషకాహారం పంపిణీ చేశారు. అనంతరం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పీడియాట్రీషియన్ డాక్టర్ రవికుమార్, డాక్టర్ సుమ చౌదరి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ నీహారిక, డాక్టర్ వంశీ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ లలిత కుమారి, పురిటిగడ్డ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సుమతి, హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకరరావు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మానవాళికి మేలు

కాజ(మొవ్వ): చిరుధాన్యాలు మానవాళికి మేలు చేస్తాయని సైంటిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ చెప్పారు. మొవ్వ మండలం కాజలోని ఆర్‌బీకే కేంద్రంలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సైంటిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ కృష్ణవేణి ముఖ్య అతిథులుగా హాజరై చిరుధాన్యాలతో తయారు చేసే పౌష్టిక ఆహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాజ వైస్ సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు, ఆర్‌బీకే చైర్మన్ పేకేటి సీతారామిరెడ్డి, పెద్దారాయుడు తోట ఎంపీటీసీ సత్యనారాయణ, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

29న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్‌హాల్‌లో జరిగే ప్రత్యేక సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సర సాధారణ ప్రతులపై రాబడిన ఆదాయ, వ్యయాల అంచనాలతో తయారు చేసిన బడ్జెట్ అంచనాలను, 2022–23 సంవత్సరానికి తయారు చేసిన రివైజ్డ్ బడ్జెట్ అంచనాలపై చర్చ జరుగుతుందని వివరించారు.

120 మందికి వైద్య సేవలు



బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ గుర్రాజు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు ఆర్. లక్ష్మి 120 మంది రోగులను పరిశీలించి మందులు అందజేశారు. జూనియర్ డాక్టర్లు సీహెచ్ జ్యోత్స్న, జి.ఉమ, ఆర్. మౌనికలు రోగులకు పరీక్షలు చేసి నివేదికలు ఇచ్చారు. కేంద్రం నిర్వాహకులు జె. వాసుదేవరావు, ఎ. రమణ, ల్యాబ్ టెక్నీషియన్ గోపి పాల్గొన్నారు.

వరికుప్ప దగ్ధం



పెడన: చేవేంద్ర గ్రామంలోని నల్లమోతు ఉదయ్‌కిరణ్‌కు చెందిన రెండు ఎకరాల వరికుప్ప గురువారం సాయంత్రం పిడుగుపాటుకు పూర్తిగా దగ్ధమైంది. శుక్రవారం ఉదయం గుర్తించి బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ప్రాథమిక విచారణ చేసి పిడుగు పడినట్లు గుర్తించి వివరాలు నమోదు చేశారు.

నేడు డ్రెయిన్ పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: 50వ డివిజన్ గుమస్తాల కాలనీలో శనివారం ఉదయం 9 గంటలకు డ్రెయిన్ నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శంకుస్థాపన చేస్తారని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆమె కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెడన: నడుపూరు గ్రామానికి చెందిన పరాసా వెంకటేశ్వరరావు పిడుగుపాటుకు గురువారం సాయంత్రం మృతిచెందాడు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి అచ్యుతరావు, గరికిపాటి వెంకటరామానాయుడు, శింగంశెట్టి రాంబాబు తదితరులు వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ మన్నెం భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్ కాలనీ, మేదర్ కాలనీ, కేంద్రియ విద్యాలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

సంపద కేంద్రం పరిసరాలు శుభ్రం



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కరకట్ట కింద నిర్మించిన సంపద సృష్టి కేంద్రం పరిసరాలను సర్పంచ్ గౌరుముచ్చు ఉమా శుభ్రం చేయించారు. నూతనంగా నిర్మించిన షెడ్ ప్రాంతంలో చెత్త, తుక్కును జేసీబీ ద్వారా తొలగించారు. వర్మీ కంపోస్ట్ తయారీ కోసం ఏర్పాటు చేసిన ఈ షెడ్ వద్ద బాగు చేయించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ ఉమా, ఈఓ తోట శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

నేడు మున్సిపల్ షాపులకు అద్దె వేలం

గుడివాడటౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని ఎస్పీఎస్ నార్త్‌బ్లాక్‌లోని ఆరు షాపుల అద్దె బహిరంగ వేలం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీఎస్ నార్త్‌బ్లాక్‌లోని మొదటి అంతస్తులో 1ఎ, 2ఎ, 16ఎ, 25ఎ, 40ఎ, 41ఎ షాపులు వేలం వేస్తారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

ముగిసిన గంగాభవానీ అమ్మవారి జాతర



గురువారం అర్ధరాత్రి యువకుల సందడి

ఆలయ ప్రవేశం చేసిన చిన్న అమ్మవారు

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 22న పశువుల జాతర, 23న ప్రధాన గుడి సంబరాన్ని నిర్వహించగా, చివరిరోజు శుక్రవారం చిన్న అమ్మవారి ఆలయ ప్రవేశంతో జాతరోత్సవాలను ముగిసినట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. ప్రధాన జాతరలో భాగంగా గురువారం రాత్రి భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జాము మూడు గంటల వరకు భక్తుల తాకిడి కొనసాగుతూనే ఉంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై భారీ లైటింగ్ ప్రభలను ఊరేగించి భక్తిభావం చాటుకున్నారు. యువకులు డప్పువాయిద్యాలు, డీజే పాటలకు అనుగుణంగా తీన్‌మార్ డ్యాన్సులతో సందడి చేశారు. నరసింహపురం, కృష్ణాపురం, దింటిమెరక, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డి వారిపాలెం, కోడూరు గ్రామాల్లో చిన్నఅమ్మవారి గ్రామోత్సవం ముగించడంతో శుక్రవారం రాత్రి ఆలయ ప్రవేశం చేయించారు. చివరి రోజు కూడా అమ్మవారి మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అవనిగడ్డ డీఎస్పీ మహబుబ్ బాషా పర్యవేక్షణలో అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, 100 మంది పోలీసులు జాతరలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి విద్యుత్ చిత్రపటం ఊరేగింపు

బ్యాంకు మిత్ర సర్వీస్ పాయింట్లపై అవగాహన

మండవల్లి: బ్యాంకుల్లో మాదిరిగానే బ్యాంకు మిత్ర సర్వీస్ పాయింట్లలో లావాదేవీలు జరుగుతాయని ఇండియన్ బ్యాంకు మేనేజర్ బొంతు దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో శుక్రవారం బ్యాంకు మిత్రలకు ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ గ్రామాల్లోని సామాన్య ప్రజలకు బ్యాంకు సేవలు అందించటానికి భైరవపట్నం, ఆనందపురం, అయ్యవారిరుద్రవరం, గన్నవరం, పెరికెగూడెం గ్రామాల్లో బ్యాంకు మిత్ర సర్వీసు పాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పాయింట్లలో కొత్త ఖాతాలు, జీపీఎఫ్ ఖాతాలు, మోటారు బీమా, జీవిత బీమా, రూ.20 వేల వరకు నగదు జమ, రూ. 10 వేల వరకు ఉపసంహరణ(విత్‌డ్రా) ఏ బ్యాంకు ఖాతా నుంచైనా చేసుకోవచ్చన్నారు. ఈ పాయింట్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకుమిత్రలు ఎస్.జోజిమేరి, ఐ.ఝాన్సీరాణి, సీహెచ్ కల్యాణి, ఎం.జాస్మిన్, జి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి



మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని, దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వరస్వామి వార్లను కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ శాసన సభ్యురాలు కంగాటి శ్రీదేవి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ శర్మ స్వామివారి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ అధికారి అర్జునరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. ఆమె వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్రౌతు రాంప్రసాద్, అరజా చలపతిరావు ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

బంటుమిల్లి: గర్భిణిలు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకు కూరలు పౌష్టికాహారంగా తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు అధికారి ఎం. సముద్రవేణి అన్నారు. మల్లేశ్వరం గ్రామంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సముద్రవేణి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లిపాత్ర ప్రముఖమైందన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి కొర్రలు, రాగులు తదితర చిరు ధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఆర్. నాగలక్ష్మి, కె. స్వరూపరాణి, పి. పెద్దింట్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

● **కోనేరుసెంటర్:** బందరు మండలం చిన్నాపురం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువులు, ఎత్తులు వారి ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పరిశీలించారు. పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రుద్రవరం, గుండుపాలెం, చిన్నాపురం, వాడపాలెం, పెదయాదర తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, మహిళా సంరక్షణ పోలీసులు పాల్గొన్నారు.

పోషక పదార్థాలతో ఆరోగ్యం

పెడన: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పోషక పదార్థాలను తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి అన్నారు. శుక్రవారం నందమూరు సెక్టారు ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ వారోత్సవాలను పెనుమల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. చారుమతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లుల ఆరోగ్య విషయంలోనే కాకుండా చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. కిశోర బాలికల ఆరోగ్య విషయంలో కూడా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను అందిస్తోందన్నారు. ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ ఎ. లక్ష్మి, హైస్కూల్ హెచ్‌ఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



నందమూరులో మాట్లాడుతున్న చారుమతి



పెదయాదరలో చిన్నారుల ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అలరించిన మోహన కృష్ణ గాత్ర కచేరీ

మచిలీపట్నంటౌన్: ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు డీవీ మోహనకృష్ణ గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. త్యాగరాజ సంగీత విద్యాపీఠం స్వర్ణోత్సవ సంగీత సభల్లో భాగంగా శుక్రవారం బుట్టాయిపేటలోని చిట్టి పిళ్లారయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో మూడో రోజు కార్యక్రమాలు జరిగాయి. మోహనకృష్ణ గాత్ర కచేరీ కరతాళ ధ్వనులందుకుంది. విద్యాపీఠం ప్రతినిధులు మాట్లాడుతూ మోహనకృష్ణ ఆకాశవాణి విజయవాడ, హైదరాబాద్ కేంద్రాల్లో స్టాఫ్ ఆర్టిస్ట్‌గా పనిచేసి ఎన్నో కార్యక్రమాలతో శ్రోతలను అలరించారని చెప్పారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణతో పాటు అనేక జనరంజకమైన కచేరీలు నిర్వహించారన్నారు.

పోపూరి శ్యామసుందర్ గాత్ర కచేరీ సభికులను ఆకట్టుకుంది. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్‌ను ఆయన గురువు ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి ఘనంగా సత్కరించారు. విజయవాడ స్వరఝరి సంస్థను స్థాపించి 35 ఏళ్లుగా సంగీత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు సుధాకర్‌ను అభినందించారు. త్యాగరాజ సంగీత విద్యాపీఠం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్, కార్యదర్శి సింగరాజు కల్యాణి, నిర్వాహక కార్యదర్శి కాళీపట్నపు ఉమా తదితరులు పర్యవేక్షించారు.



కచేరీ నిర్వహిస్తున్న మోహన కృష్ణ

తల్లీబిడ్డల నమోదు ఆన్‌లైన్ చేయండి

పెడన: వారం వారం నివేదికలు ఇచ్చే విషయంలోనే కాకుండా శుక్రవారం డ్రై డే, తల్లీబిడ్డల నమోదు వంటి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రామారావు అన్నారు. శుక్రవారం ఆయన చేవేంద్ర ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బంది, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారంలో కార్యక్రమాలు బాగానే నిర్వహిస్తున్నా ఆన్‌లైన్‌లో పొందుపరిచే విషయంలో వెనుకబడుతున్నారని చెప్పారు. ఆన్‌లైన్ నిర్ణీత సమయంలోగా చేయకపోవడం వల్ల వెనుకబడి ఉంటున్నారని గుర్తించాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితి రానీయవద్దని చెప్పారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పూర్తి చేయండి

పెడన: పట్టణంలో భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవి ఏరకానికి చెందిన భూములో గుర్తించి రికార్డులలో నమోదు చేసి ఆన్‌లైన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య అన్నారు. కమిషనర్ తన చాంబరులో వార్డు సచివాలయాలకు చెందిన సర్వే కార్యదర్శులు, వీఆర్వోలతో భూ హక్కు, భూ రక్ష పథకానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ఆస్తులకు సంబంధించి 8 వేల గృహాలను సర్వే చేశామన్నారు. భూములకు సంబంధించి పట్టణంలో 711 సర్వే నెంబర్లు ఆర్‌ఎస్‌లలో ఉన్నాయని, వీటిని 1923 రీ సర్వే రికార్డులను బేస్ చేసుకుని ఆయా భూముల స్థితిగతులను (ప్రభుత్వ, పట్టా, కాలువ భూమి) తెలుసుకుని వాస్తవ పరిస్థితులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్‌డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. హెచ్‌ఎం జయంతి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థి కె. నవీన్ ఆదిత్య కుమార్‌ను హెచ్‌ఎం జయంతి, సబ్బినేని సాంబశివరావు అభినందించారు.

ఆర్థికాభ్యున్నతే ధ్యేయం

కృత్తివెన్ను: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎఫ్‌డీఓ డి. అంజని అన్నారు. విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తుల తయారీలో భాగంగా శుక్రవారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. చేపలతో వివిధ రకాల వంటకాల తయారీలో పలువురు మహిళలకు శిక్షణ ఇచ్చారు.

వంటల తయారీలో శిక్షణ

కోడూరు: మత్స్యశాఖ ఆధ్వర్యంలో పాలకాయతిప్ప గ్రామంలో మత్స్యకార మహిళలకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతుల్లో శుక్రవారం వంట తయారీపై అవగాహన కల్పించారు. యుఎన్‌డీ–జీఈఎఫ్ ఆర్థిక సౌజన్యంతో సాగుతున్న శిక్షణలో రెండో రోజు ఘంటసాలకు చెందిన కృషి విజ్ఞాన కేంద్ర మత్స్య శాస్త్రవేత్త యశ్వంత్ కుమార్ పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. చేపలు, రొయ్యల పచ్చడి తయారీలో అనుసరించాల్సిన మెలకువలను నేర్పించారు. ఆధునిక పద్ధతులతో తయారు చేస్తున్న చేపల కబాబ్, రొయ్యల వేపుడు, చేపల టికా తదితర వంటకాలపై శిక్షణ ఇచ్చారు.

మహిళలతో ప్రయోగాత్మకంగా వంటకాలు చేసి చూపించారు. శనివారంతో శిక్షణ ముగుస్తుందని, ఇందులో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని ఎఫ్‌డీఓ సత్యనారాయణ తెలిపారు. సర్పంచి కొక్కిలిగడ్డ భిక్షాలు, మత్స్యకార సంఘ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.



వంటల తయారీలో శిక్షణ ఇస్తున్న అధికారులు